క్లుప్తంగా

సత్యసాయి ఆరాధనోత్సవం



ఆత్మకూర్: పట్టణంలోని శ్రీసత్యసాయి మందిరంలో ఆరాధన మహోత్సవ పూజ కార్యక్రమాలను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. 11:30 గంటలకు స్వామివారి అష్టోత్తరం, భజన చేశారు. 12:30 నారాయణ సేవలో భాగంగా అన్నదానం చేపట్టారు. సాయంత్రం భజన కార్యక్రమాలతో పాటు ప్రత్యేక పూజలను నిర్వహించారు.

కుష్టు నిర్ధారణ పరీక్షలు



ఆత్మకూర్: స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గురువారం అనుమానితులకు కుష్టువ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. జిల్లా డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో 20 మంది అనుమానితులకు వైద్య పరీక్షలు నిర్వహించి, కావాల్సిన మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్, ఆశాకార్యకర్తలు లలిత, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక చేయూత



పాన్‌గల్: మండలంలోని గోప్లాపూర్ గ్రామానికి చెందిన గంధం చిన్నరాములు మండల మహిళ సమాఖ్యలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల హఠాన్మరణం చెందారు. స్నేహితుడి కుటుంబానికి తమ వంతు సహాయంగా 2005–06 పదో తరగతి బ్యాచ్ మిత్రులు రూ.32 వేలు జమ చేసి గురువారం దశదిన కర్మ రోజు మిత్రుడి కుటుంబానికి అందజేశారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పాన్‌గల్: మండల కేంద్రానికి చెందిన హమాలీ ఎనుముల బాలయ్య మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని డీసీసీబీ చైర్మన్ మామిళ్లపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, డా.పగిడాల శ్రీనివాసులు గురువారం పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతుడి కుటుంబాన్ని ప్రభుత్వపరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాముయాదవ్, బ్రహ్మయ్య, సింగిల్ విండో సీఈఓ భాస్కర్‌గౌడ్, మాధవరావు, హమాలీలు ఉన్నారు.

ధారాసింగ్‌కు సన్మానం



చిన్నంబావి: మండలంలోని బెక్కెం గ్రామానికి చెందిన ప్రముఖ విద్యాసంస్థల అధినేత ధారాసింగ్‌కు ఇటీవల అంబేడ్కర్ ఎక్స్‌లెంట్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన యువకులు గురువారం ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో నరేష్, మహేష్, రాజు, రంజిత్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండలంలోని తాటిపాములలో మాజీ సర్పంచ్ సత్యంయాదవ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి క్రికెట్ పోటీలను సింగిల్ విండో చైర్మన్ జగన్నాథంనాయుడు గురువారం ప్రారంభించారు. పోటీల్లో 30 జట్లు పాల్గొన్నాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మద్దిలేటి, ఆంజనేయులు, బాలరాజు, చిన్న ఆంజనేయులు, రాఘవేంద్రారెడ్డి, చంద్రాయుడు, సత్యం పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ

కోడేరు: మండలంలోని నర్సాయిపల్లిలో ఉపాధి హామీ పనులను పంచాయతీ కార్యదర్శి ప్రదీప్‌కుమార్‌గౌడ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొలతల ప్రకారం పనులు చేయాలని అన్నారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పని చేయాలని కూలీలకు సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

‘భూ భారతి’తో భూములకు రక్షణ

- చట్టం ప్రతి పేదోడికి చుట్టం
- ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ ఆదర్శ్‌సురభి

కొత్తకోట/మదనాపురం: ప్రజాపాలనలో ప్రజలు మెచ్చే విధంగా భూ భారతి ఆర్‌ఓఆర్ చట్టం తీసుకొచ్చినట్లు కలెక్టర్ ఆదర్శ్‌సురభి, శాసనసభ్యులు జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. గురువారం కొత్తకోట పట్టణ కేంద్రంలో, మదనాపురం మండల కేంద్రంలోని రైతువేదికలో భూ భారతి కొత్త ఆర్‌ఓఆర్ చట్టం 2025 పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెలిచిన ధరణి చట్టం అంటేనే దరిద్రమని, అలాంటి మహమ్మారిని కోట్ల మంది రైతులపై రుద్ది బీఆర్‌ఎస్ పాలకులు ఇబ్బందులకు గురిచేశారని మండిపడ్డారు. ధరణి వల్ల రైతులకు మేలు జరగకపోగా అనేక సమస్యలకు గురి చేశారన్నారు. ధరణి చట్టంతో లాభపడింది కేవలం కల్వకుంట్ల కుటుంబమే అని ఎద్దేవా చేశారు. వేల ఎకరాల భూమి కొల్లగొట్టారని, భూ భారతి చట్టం ద్వారా వారు చేసిన దోపిడిని బట్టబయలు చేస్తామని తెలిపారు. భవిష్యత్ తరాలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా భూ భారతి చట్టానికి రూపకల్పన చేశామని పేర్కొన్నారు.

గ్రామ స్థాయిలోనే పరిష్కారం

త్వరలోనే గ్రామ రెవెన్యూ వ్యవస్థను తీసుకొస్తామని, దీంతో చాలా సమస్యలకు గ్రామస్థాయిలో పరిష్కారం దొరుకుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జూన్ నుంచి ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామని, ధరణి వలన వచ్చిన సమస్యలను అక్కడే పరిష్కరిస్తామని వెల్లడించారు. కొత్తకోట మండలంలో 5,768 మంది రైతులకు రూ.43.70 కోట్ల రుణమాఫీ జరిగిందన్నారు. రైతు భరోసా ద్వారా 15 వేల మంది రైతులకు రూ.10.90 కోట్లు జమ చేసినట్లు వెల్లడించారు. సన్న వడ్ల కోసం ప్రభుత్వం రూ.500లు బోనస్ ఇస్తుందని, మండలంలో 3,020 మంది రైతులు రూ.9.46 కోట్లు ఆర్జించారన్నారు.

ఎల్లప్పుడూ అందుబాటులో..

ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని కలెక్టర్ ఆదర్శ్‌సురభి అన్నారు. భూ భారతి చట్టంపై ఏ అనుమానాలు, సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం భూ భారతి చట్టంపై అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.వెంకటేశ్వర్లు, ఆర్డీవో సుబ్రమణ్యం ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కొత్తకోట, మదనాపురం తహసీల్దార్లు వెంకటేశ్వర్లు, అబ్రహం లింకన్, మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రశాంత్, కిసాన్ సెల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి



మహాసభ పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

ఆత్మకూర్: నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలో ఈ నెల 26, 27వ తేదీల్లో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు రాజు పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని మూలమళ్ల గ్రామంలో కార్మికులతో కలిసి మహాసభల వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు, ఉపాధి కూలీలకు రోజుకూలి రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేసారు. మహాసభలకు సీపీఎం రాష్ట్రకార్యదర్శి జాన్‌వెస్లీతో పాటు పలువురు ప్రముఖులు హాజరవుతున్నారన్నారు.

వరాహాలకు ఆవాసంగా పొల్కిచెరువు పరిసరాలు



పొల్కిచెరువు నీటి సమీపంలోనే పందుల ఆవాసం

పాన్‌గల్: మండల కేంద్రం శివారులోని పొల్కి చెరువు పరిసరాలు పందులకు ఆవాసంగా మారింది. గ్రామానికి చెందిన పందులను చెరువు పరిసరాల్లో కొట్టాల్లో ఉంచుతూ.. వాటికి తినుబండరాలు వేస్తుండటంతో చెరువు పరిసరాలు దుర్వాసన వెదజల్లుతోందని గ్రామస్తులు వాపోతున్నారు. దీనితోడు చెరువు నీరు సైతం కలుషితం అవుతోందని, అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. చెరువు సమీపంలోనే తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలు ఉన్నా.. ఆయా అధికారులు అక్కడి నుంచే వెళ్తున్నా వీటి గురించి ఏమాత్రం పట్టించుకోకపోవడంతో పందుల యజమాని తన ఇష్టానుసారంగా చెరువు పరిసరాల్లో తినుబండరాలను వేస్తూ పందులను మేపుతున్నాడని గ్రామస్తులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెరువు నీరు కలుషితం కాకముందే పందుల ఆవాసాన్ని తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యానికి మద్దతు ధర



వెలగొండలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న అధికారులు



తాటిపాములలో..

వనపర్తి రూరల్: కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యానికి మద్దతు ధర లభిస్తుందని, రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని పెబ్బేరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విజవర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్ సూచించారు. శ్రీరంగాపురం మండలంలోని తాటిపాములలో ఐకేపీ ద్వారా ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం వారు ప్రారంభించారు.

చిన్నంబావి: మండలంలోని వెలగొండ, మియాపూర్ గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఏపీఎం మద్దిలేటి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నాగారాజు, మాజీ ఎంపీటీసీ మహదేవ్‌గౌడ్, ప్రశాంతి, అరుణ, శివుడు, సాయిబేగం తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో స్వయంపాలన దినోత్సవం



చిన్నారులతో ఐసీడీఎస్ సిబ్బంది

కొత్తకోట రూరల్: మండలంలోని కనిమెట్ట అంగన్‌వాడీ కేంద్రం–1లో గురువారం చిన్నారులు గ్రాడ్యుయేషన్, స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు వివిధ అధికారుల హోదాల్లో ముస్తాబై వచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు, డ్యాన్సులు, పాటలతో పలువురిని ఆకట్టుకున్నారు. అంగన్‌వాడీ టీచర్ తిరుమలేశ్వరిని ఐసీడీసీ సూపర్‌వైజర్ కవితతో పాటు చిన్నారుల తల్లిదండ్రులు అభినందించారు. కార్యక్రమంలో పల్లె దవాఖాన డాక్టర్ నిహారిక, ఏఎన్ఎం విజయ, ఆశావర్కర్ ఇంద్రమ్మ, ఆయా మన్నెమ్మ, తిరుపతమ్మ, చిన్నారుల తల్లులు తదితరులు ఉన్నారు.

శివపార్వతుల కల్యాణం



శాంతినగర్: వడ్డేపల్లి మండల పరిధిలోని రామాపురం గ్రామంలో వెలసిన ఉభయలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శివపార్వతుల కల్యాణ వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం, ఉభయలింగేశ్వరాస్వామి మూల విగ్రహాల ప్రతిష్ఠ జరిగి ఏడాది పూర్తయిన సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు ఆధ్వర్యంలో వేడుకలు కనులపండువగా జరిపించారు. అనంతరం భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.

‘నిర్వాసితులకు ఉద్యోగాలు ఇవ్వాలి’

కొల్లాపూర్: శ్రీశైలం నిర్వాసితులకు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలని నిర్వాసిత నిరుద్యోగ సంఘం నాయకులు మేనుగొండ రాముయాదవ్ కోరారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 98 జీఓ బాధితులకు ఉద్యోగాలు కల్పిస్తామని పాలక ప్రభుత్వాలు హామీలు ఇస్తూ మోసం చేస్తున్నాయని వాపోయారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఏపీలో అక్కడి ప్రభుత్వాలు నిర్వాసితులకు ఉద్యోగాలు కల్పిస్తున్నాయని, తెలంగాణలో మాత్రం ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి కనబరుస్తోందన్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి శ్రీశైలం నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరారు.

ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం



జిల్లా కేంద్రంలో నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



పాన్‌గల్ మండలం రేమద్దులలో..

వనపర్తి రూరల్: జమ్ముకశ్మీర్ రాష్ట్రంలోని పహల్‌గామ్ వద్ద పర్యాటకులపై జరిగిన తీవ్రవాద దాడిని ఖండిస్తూ, మృతిచెందిన వారికి సంతాపంగా గురువారం రాత్రి సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి పాలిటెక్నిక్ కళాశాల వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, ఎండీ జబ్బార్, పట్టణ కార్యదర్శి పరమేశ్వరాచారి, కురుమయ్య, బాలస్వామి, గంధం మదనవిజయకుమార్, శ్రీనివాసులు, మహేష్, బొబ్బిలి నిక్సన్, రవి, రాబర్ట్ తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: జమ్ముకాశ్మీర్ పహల్గామ్‌లో పర్యాటకుల పైన ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం రాత్రి మండలంలోని రేమద్దులలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో వెంకటయ్య, భగత్, కోదండరాములు, ఆంజనేయులు, భాస్కర్, చంద్రశేఖర్, ఖాజా, నిరంజన్, ఆయోధ్యరాములు, వెంకటయ్య, రమేష్, వెంకటేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

రూ.2 లక్షల ఎల్వోసీ అందజేత

పాన్‌గల్: మండలంలోని గోప్లాపూర్ గ్రామానికి చెందిన బుసి బాలస్వామికి మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం సీఎం సహాయనిధి నుంచి రూ.2 లక్షల ఎల్‌ఓసీ మంజూరు కాగా గురువారం బాధిత కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పుల్లారావు అందజేశారు. బుసి బాలస్వామి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకొని అతడికి మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం మంత్రి జూపల్లి సహకారంతో ఎల్‌ఓసీని అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు.

భూ భారతిపై అవగాహన కార్యక్రమం వాయిదా

అమరచింత: మండలంలోని నాగల్‌కడ్మూర్ రైతువేదికలో శుక్రవారం నిర్వహించే భూ భారతి అవగాహన కార్యక్రమం అనివార్య కారణాల వల్ల వాయిదా పడిందని తహసీల్దార్ రవికుమార్‌యాదవ్ తెలిపారు. వాయిదా పడిన కార్యక్రమం ఎప్పుడు నిర్వహిస్తామనేది రైతులకు తెలియపరుస్తామన్నారు.

ప్రజా సేవ చేయడమే లక్ష్యం

రాజోళి: ప్రజలకు సేవ చేయడమే చిరంజీవి ఫ్యాన్స్ లక్ష్యమని చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు శివరామయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఫ్యాన్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహసీల్దార్ పి.రామ్మోహన్ ప్రారంభించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం శుభ పరిణామమని, యువత ఇలాంటి సేవా కార్యక్రమాలు మరిన్ని చేయాలని తహసీల్దార్ అన్నారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు నిషాక్, వీరేష్ తదిదరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకే ఇళ్ల నిర్మాణాలు



ధర్మాపురంలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారుడికి అవగాహన కల్పిస్తున్న డీపీఓ సురేష్‌కుమార్



ఆగారంలో..

అమరచింత: ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు నిబంధనల మేరకు ఇంటిని నిర్మించుకుంటేనే బిల్లుల రూపంలో డబ్బులు మంజూరవుతాయని మండల స్పెషల్ ఆఫీసర్, డీపీఓ సురేష్‌కుమార్ అన్నారు. మండలంలోని ధర్మాపురం, చంద్రనాయక్‌తండాలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరయిన లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఇంటి నిర్మాణాలపై అవగాహన కల్పించారు. సొంతంగా ఇంటి స్థలం ఉండాలని, పునాది వరకు నిర్మిస్తే రూ.లక్ష మంజూరు అవుతాయని, అలాగే నిర్మాణం పూర్తయ్యే కొద్ది విడతల వారీగా బిల్లులు చెల్లిస్తామని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపడుతుందని, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని, అర్హులందరికీ న్యాయం చేస్తామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్‌యాదవ్, ఏపీఓ నరసింహులు, ఆర్‌ఐ గోపాల్ పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల కోసం మంజూరు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో పారదర్శకత ఉండేలా చూస్తామని ఆగారం గ్రామ ప్రత్యేక అధికారి నరేష్ అన్నారు. గురువారం మండలంలోని ఆగారంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారుల వివరాలను ప్రత్యేక అధికారులు పరిశీలించారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మున్నూరు జయకర్, కృష్ణయ్య, శంకరమ్మ, బాల్‌చందర్, మల్లయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీల్లో ‘నిధుల’ కటకట

- కుంటుపడుతున్న అభివృద్ధి
- మరమ్మతుకు నోచుకోని చేతిపంపులు, బోరు బావులు
- గ్రామాల్లో తీవ్ర సమస్యలు



మియాపూర్‌లో పేరుకుపోయిన మురుగు



గూడెం గ్రామంలో తాగునీటికి కోసం ప్రజల ఇక్కట్లు

చిన్నంబావి: గ్రామ పంచాయతీలకు కొన్ని నెలలుగా నిధులు సకాలంలో విడుదల కాకపోవడంతో గ్రామాల అభివృద్ధి కుంటుపడుతోందని పంచాయతీ కార్యదర్శులు, ప్రజలు వాపోతున్నారు. గ్రామంలో ఉన్న సమస్య పంచాయతీ కార్యదర్శుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం చూపడం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మల్టీపర్పస్ వర్కర్ల వేతనాలు తప్పా ఇతర నిధులు మంజూరు చేయకపోవడంతో తాము చేతి నుంచి ఖర్చు చేయాల్సి వస్తోందని పంచాయతీ కార్యదర్శులు వాపోతున్నారు.

ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో..

మండలంలో 17 గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహించే ఆయా పంచాయతీ కార్యదర్శి అత్యవసర సమయంలో అప్పు చేసి రూ.1.50లక్షల నుంచి రూ.2లక్షల వరకు ఖర్చు చేశారు. ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు చెల్లించక తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్నామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేసిన పనులకు బిల్లులు పెట్టినా.. డబ్బులు విడుదల చేయకుండా తిరస్కరిస్తున్నారని అసహనం చెందుతున్నారు.

వేసవిలో ఇబ్బందులు

గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటడడంతో ప్రజలు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బోరు బావులు, చేతిపంపుల్లో మరింత లోతుకు పైపులు వేద్దామంటే పంచాయతీల్లో నిధులు లేవని పంచాయతీ కార్యదర్శులు చేతులెత్తేశారు. ఇదిలా ఉండగా గ్రామాల్లో వివిధ పన్నులు వసూలు చేస్తున్నప్పటికీ ఆ నిధులు అందుబాటులో ఉన్నా.. వాటిని సైతం విత్ డ్రా చేసుకోలేని పరిస్థితి ఉందని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిధులు విడుదల చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యలు తాండవం

మండల వ్యాప్తంగా గ్రామాల్లో సమస్యలు తాండవిస్తున్నాయి. సర్పంచ్‌ల పాలన ముగియడం, ప్రత్యేకాధికారుల కేటాయించడంతో గ్రామ పంచాయతీలు అస్తవ్యస్తంగా తయారయ్యాయి. మూడు, నాలుగు గ్రామాలకు కలిపి ఒక పత్ర్యేకాధికారిని నియమించడంతో వారు పని ఒత్తిడికి లోనై గ్రామాల్లో పర్యటించడమే మానేశారు. దీంతో డ్రైయినేజీలను శుభ్రం చేయకపోవడం, రోడ్లపై చెత్త పేరుకుపోవడం, నర్సరీల నిర్వహణలో నిర్లక్ష్యం వంటి నిర్వహణ లోపం కనిపిస్తోంది. చాలా గ్రామాల్లో పల్లె ప్రకృతి వనాలు ఎండిపోయి దర్శనమిస్తున్నాయి. నర్సరీల నిర్వహణ తూతూమంత్రంగానే సాగుతోంది.

ఇబ్బందులు ఎదురవుతున్నాయి



ప్రత్యేకాధికారుల పాలన వల్ల గ్రామాల్లో కొంత ఇబ్బంది ఏర్పడుతుంది. గ్రామ అభివృద్ధి కార్యక్రమాలు, ఉపాధి హామీ పథకం పనులతో పంచాయతీ కార్యదర్శులపై ఒత్తిడి పెరుగుతోంది. నిధుల మంజూరులో జాప్యం జరుగుతుండడంతో ఆర్థిక ఇబ్బందులు వస్తున్నాయి. అత్యవసరం ఉన్నచోట విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, ప్రత్యేక నిధులతో పనులు సకాలంలో పూర్తయ్యేలా చూస్తున్నాం.

– రమణరావు, ఎంపీడీఓ

మహిళ అదృశ్యం

గోపాల్‌పేట: కుటుంబ సభ్యులతో గొడవపడి తల్లిగారి ఇంటికి వెళ్లి వస్తానని చెప్పి బయలుదేరిన మహిళ తిరిగి ఇంటికి రాకపోవడంతో భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని గోపాల్‌పేట ఎస్‌ఐ నరేష్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని రాంనగర్‌కాలనీకి చెందిన జోగు ఎల్లమ్మ, జోగు రామస్వామి భార్యాభర్తలు. వీరికి ముగ్గురు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉండగా.. ఇద్దరు కుమార్తెల పెళ్లిళ్లయ్యాయి. కుమారుడు హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఈ క్రమంలో పక్కింట్లోనే ఉండే అత్త, కోడలికి అప్పుడప్పుడూ గొడవ జరిగేది. బుధవారం పక్కింట్లో ఉండే అత్తతో గొడవ కాగా తన తల్లిగారి ఇంటికి ఏదులకు వెళ్లి వస్తానని చెప్పినా.. ఆమె ఆచూకీ కనిపించలేదు. గురువారం ఎల్లమ్మ భర్త రామస్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

చాకల్‌పల్లికి చెందిన ధర్మారెడ్డి..

మండలంలోని చాకల్‌పల్లికి చెందిన రాకాసి ధర్మారెడ్డి మంగళవారం సాయంత్రం ఏడు గంటల ప్రాంతంలో గ్రామంలోని రచ్చకట్ట వద్దకు వెళ్తున్నానని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. ఎంత వెతికినా ప్రయోజనం లేకపోవడంతో గురువారం కుమారుడు లోకేశ్వర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని తెలిపారు.

దేశానికి గ్రామాలే పట్టుగొమ్మలు



మొక్కలు నాటుతున్న పవన్‌కుమార్

మానవపాడు: దేశానికి పట్టుకొమ్మలు గ్రామాలని ఎంపీడీఓ భాస్కర్ అన్నారు. మండలంలోని పెద్దఆముదాలపాడు గ్రామంలో గురువారం ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ప్రత్యేక గ్రామసభ నిర్వహించి, సమావేశంలో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కార్యదర్శి, గ్రామపెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అయిజ: మండలంలోని వేణిసోంపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో మోడల్ గ్రామ పంచాయతీ క్లస్టర్ ప్రాజెక్ట్ జిల్లా కోఆర్డినేటర్ పవన్ కుమార్, కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్ మాట్లాడారు. 1993 ఏప్రిల్ 24న 73వ రాజ్యాంగ సవరణ ద్వారా పంచాయతీ రాజ్ వ్యవస్థకు రాజ్యాంగ హక్కు లభించిందన్నారు. పౌరులు తమ హక్కులతోపాటు బాధ్యతలపై కూడా అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా గ్రామసభ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.